సాక్షి
విశాఖపట్నం
గురువారం । 6 । ఏప్రిల్ । 2023



'డ్రోన్'తో కాలుష్య నియంత్రణ
కాలుష్యంపై కొన్నేళ్ల క్రితం విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో సింహాద్రి ఎన్‌టీపీసీ వినూత్న చర్యలకు ఉపక్రమించింది. 8లో



ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు
బెంగళూరు–భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో వాల్తేర్ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి బుధవారం తనిఖీలు చేశారు. 8లో



'సీ'గల్స్ సందడి
విశాఖ సాగరతీరంలో సీగల్ పక్షులు సందడి చేస్తున్నాయి. రివ్వున ఎగురుతూ సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. 8లో



న్యూస్‌రీల్

ఐదు కరోనా కేసులు నమోదు



మహారాణిపేట: విశాఖలో బుధవారం ఐదు కరోనా కేసులు నమోదయ్యాయి. జిల్లాలో కరోనా వైరస్ ప్రభావం పూర్తిగా తగ్గిందనుకుంటున్న సమయంలో.. ఒకేసారి ఐదు కేసులు నమోదవడంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఈ నెల 10, 11వ తేదీల్లో మాక్‌డ్రిల్ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తోంది. కాగా.. జిల్లాలో ప్రస్తుతం కరోనా సోకిన వారి సంఖ్య 22కు చేరుకుంది. 19 మంది హోం ఐసోలేషన్ ఉండగా, కేజీహెచ్‌లో ఒకరు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మాస్క్ లేకుండా బయట తిరగొద్దన్నారు. లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

వందేభారత్ నేడు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ (20833) వెళ్లాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను గురువారం రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వస్తున్న వందేభారత్ రైలుపై ఖమ్మం – విజయవాడ మధ్యలో దుండగులు జరిపిన రాళ్ల దాడిలో సీ 8 కోచ్ అద్దాలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కోచ్‌కు సంబంధించిన అద్దాన్ని విశాఖపట్నం చేరుకున్నాక మార్పు చేశారు. ఈ కారణంగా గురువారం ఉదయం 5.45 గంటలకు బయల్దేరాల్సిన వందేభారత్ 4 గంటలు ఆలస్యంగా 9.45 గంటలకు బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.


వేగవంతంగా ఇళ్ల నిర్మాణం



ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ల్యాప్‌టాప్స్ అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: నవరత్నాలులో భాగంగా పేదలందరికీ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు 40 మందికి ల్యాప్‌టాప్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాప్‌టాప్స్ సౌలభ్యం వల్ల లబ్ధిదారుల తరపున బిల్స్ అప్‌డేట్ చేయడంతోపాటు అప్‌లోడు చేయడానికి ఎంతో సమయం ఆదా అవుతుందన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సబ్సిడీ ధరకు ఇనుము, సిమెంట్, ఇసుక తదితర సామగ్రి వేగవంతంగా అందించడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఆర్‌డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డు



సేవా వార్డును ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: నిరాశ్రయులకు కేజీహెచ్‌లో ప్రత్యేకంగా సేవా వార్డును ఏర్పాటు చేశారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ ఈ వార్డును ప్రారంభించారు. ఎవరూ లేని వారి కోసం పాత బ్లడ్ బ్యాంక్‌కు ఎదురుగా 10 పడకలతో ఈ వార్డును ఏర్పాటు చేశారు. వీరికి ఉత్తమ సంరక్షణ, చికిత్స అందిస్తామని డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఆర్‌ఎంవో కె.జగదీష్ కుమార్, ఏఆర్‌ఎంవో ఎ.విజయలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్లు రమణమ్మ, కల్పనా మౌళి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

'డ్రెడ్జింగ్'లో చీడపురుగు!

డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎండీ నియామకం మొదలుకొని, సంస్థను విదేశీ కంపెనీలకు విక్రయించేందుకు సొంత ఉద్యోగులే ప్రయత్నించడం తీవ్ర దుమారం రేపింది. తప్పుడు ధృవపత్రాలతో ఓ ఉద్యోగి ఎండీగా నియమితులు కాగా.. ఆ నియామకం వెనుక మరో అధికారి కుట్ర ఉండటంపై సంస్థ ఉద్యోగులే సీబీఐకి ఫిర్యాదు చేశారు. సీఎస్‌ఆర్ నిధులను కూడా స్వాహా చేసేసిన ఆ అధికారి అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఉపక్రమించింది.

- మేనేజ్‌మెంట్ ట్రైనీగా మొదలుపెట్టి.. కీలక స్థాయికి ఎదిగిన ఉద్యోగి
- సంస్థను దుబాయ్‌కి విక్రయించేందుకు బేరం
- నష్టాల బాట పట్టించేందుకు పూర్వ ఎండీతో కలిసి కుట్ర పన్నినట్లు ఆరోపణ
- సీఎస్‌ఆర్ నిధులు కూడా స్వాహా
- సీబీఐకి ఫిర్యాదు చేసిన ఉద్యోగులు



సాక్షి, విశాఖపట్నం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ)లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా అడుగు పెట్టిన ఓ వ్యక్తి.. ఆ సంస్థను శాసించే స్థాయికి చేరుకున్నాడు. ట్రైనీగా విధులు ప్రారంభించినప్పటి నుంచి అవినీతికి శ్రీకారం చుట్టిన సదరు ఉద్యోగి అంచెలంచెలుగా ఎదిగాడు. అక్రమంగా వచ్చిన డబ్బును ఉన్నతాధికారులకు ఆశ చూపిస్తూ.. ఆయనతోపాటు విధుల్లో చేరిన వారికంటే ముందుగానే ప్రమోషన్లు పొందాడు. ప్రస్తుతం సదరు ఉద్యోగి జాయింట్ జనరల్ మేనేజర్ హోదాలో చక్రం తిప్పుతుంటే.. ఆయనతో పాటు విధుల్లో చేరిన వారంతా జాయింట్ మేనేజర్లగా అతడి కింద పనిచేస్తుండటం గమనార్హం.

రిక్రూట్‌మెంట్ కూడా ఆయన కనుసన్నల్లోనే..
ఏదైనా ఒక పనికి సంబంధించిన ఫైల్ ఒక ఉద్యోగి వద్ద ఉంటే.. దాని వల్ల లాభం వస్తుందని అనుకుంటే.. సదరు అధికారి అన్నీ తానై ఆ ఫైల్ పని పూర్తి చేసేసేవారు. ఇదే రీతిలో డీసీఐ ఎండీ నియామకం విషయంలోనూ కీలకంగా వ్యవహరించారు. సదరు అధికారికి సంబంధం లేకున్నా ఎండీగా విక్టర్ నియామకం దగ్గరుండి చేపట్టారు. అక్రమంగా జరిగిన ఈ నియామకంపై దుమారం రేగిన విషయం విదితమే.. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టి, విక్టర్‌ని విధుల నుంచి తొలగించగా సదరు అక్రమాధికారిని సస్పెండ్ చేశారు. కొద్ది రోజులకే తన పలుకుబడితో సస్పెన్షన్‌ను రీవోక్ చేయించుకొని తిరిగి విధుల్లో చేరిపోయారు. ఈయనకు బాధ్యతలు అప్పగించడం ఇష్టంలేని మంత్రిత్వ శాఖ అధికారులు కోల్‌కతా బ్రాంచ్‌లో ఎలాంటి ప్రాధాన్యం లేని ఆర్‌జీఎంగా పోస్టింగ్ ఇచ్చారు.

అడ్వాన్స్‌డ్ సీఎస్సార్ నిధులు?
సాధారణంగా ఏ సంస్థ అయినా ఆ ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాల్ని బేరీజు వేసుకొని కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సేవా కార్యక్రమాలకు సీఎస్సార్ నిధులను ఖర్చు చేస్తుంటుంది. డీసీఐలో ఈ వ్యవహారాలన్నీ సదరు అధికారి చేతుల మీదుగానే జరిగేవి. ఆ సీఎస్సార్ నిధులను తనకు నచ్చిన సంస్థలు, కాంట్రాక్టర్లకు అప్పగించి భారీ ఎత్తున కమీషన్లు పొందేవారు. అంతేకాకుండా ఏ సంస్థలోనూ లేని విధంగా ముందస్తుగానే సీఎస్సార్ నిధులను ఖర్చు చేసేవారు. ఈ ఏడాది సంస్థకు లాభాలు వస్తాయంటూ అడ్వాన్స్‌డ్ ఫండ్స్ అని కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. డీసీఐలో దోచుకున్న సొమ్ముతో విశాఖపట్నం బీచ్‌రోడ్డులో విలాసవంతమైన అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసుకున్నట్లు తెలుస్తోంది.

దుబాయ్ సంస్థకు విక్రయించేలా...?
డీసీఐలో నష్టాల్ని చూపించి, సంస్థను దివాలా తీయించాలనే కుట్రకు సూత్రధారిగా సదరు అధికారే వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తానే పోస్టింగ్ ఇచ్చిన అప్పటి ఎండీ విక్టర్‌తో కలిసి, ఈ అడ్డగోలు కథని నడిపించారని ఉద్యోగులు చెబుతున్నారు. దుబాయ్‌కి చెందిన ఓ డ్రెడ్జింగ్ సంస్థతో ముంబై, కోల్‌కతాలో చర్చలు జరిపి బేరసారాలు కూడా మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. డీసీఐ ప్రైవేటీకరణ దిశగా వెళ్లిపోతుందంటూ ప్రచారం కూడా చేశారు. ఈ వ్యవహారం అప్పటి ఉద్యోగులు బయటకు తీసుకురావడతో విక్టర్ నియామకంపైన, ఈ అధికారి వ్యవహార శైలిపైన విచారణ ప్రారంభమైంది. ఎండీ, సీఈవో నియమాకంలో అవకతవకలు జరిగిన విషయం వెలుగులోకి రావడం, విజిలెన్స్ విచారణ నిర్వహించి.. ఎండీని తొలగించడం.. ఆయన స్థానంలో కొత్త ఎండీ, సీఈవోగా కెప్టెన్ దివాకర్‌ని నియమించడం చకచకా జరిగిపోయాయి. సదరు అధికారి సస్పెన్షన్‌ను రీవోక్ చేసుకొని మళ్లీ విధుల్లోకి రావడంపై ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఆయన అక్రమాల జాబితాను నివేదిస్తూ సీబీఐకి ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభమైంది. ప్రస్తుత ఎండీగా వ్యవహరిస్తున్న కెప్టెన్ దివాకర్‌పైనా విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది.

డీసీఐ మాజీ సెక్రటరీపై సీబీఐకి ఫిర్యాదు.!
డీసీఐ మాజీ సెక్రటరీ అశ్వనీ శ్రీకాంత్‌పై సంస్థ ఉద్యోగులు సీబీఐకి ఫిర్యాదు చేశారు. సంస్థలో ఇటీవల జరిగిన పరిణామాలకు శ్రీకాంత్ కీలక సూత్రధారి అంటూ దానికి సంబంధించిన పూర్తి ఆధారాలను సీబీఐకి అందించారు. ఈ ఫిర్యాదుపై ఇప్పటికే డీసీఐలో కొందరు ఉద్యోగుల్ని సీబీఐ అధికారులు విచారించినట్లు తెలుస్తోంది. అయితే సస్పెన్షన్‌ను రీవోక్ చేసుకున్న శ్రీకాంత్ ప్రస్తుతం కోల్‌కతా శాఖలో ఆర్‌జీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

పార్టీ కోసం కొత్తవారు రావాల్సిందే..

- చేరికలపై చంద్రబాబు వ్యాఖ్యలు
- ఇప్పుడున్నవారి బలం చాలదన్నట్లుగా వ్యాఖ్యలు
- అయ్యన్నకు దగ్గరగా.. గంటాకు దూరంగా...!
- చంద్రబాబు రాకముందూ వేదికపైనే కనిపించిన దూరం



వేదికపై ముఖ్యులతో పాటు అయ్యన్నని పిలిచి ఫొటో తీసుకుంటున్న చంద్రబాబు, మరోవైపు కూర్చున్న గంటా

సాక్షి, విశాఖపట్నం: పార్టీ బలోపేతం కావాలంటే కొత్తవారు రావాల్సిందేనని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యాఖ్యలు చేయడంపై కార్యకర్తలు, నాయకుల్ని విస్మయానికి గురిచేసింది. పరోక్షంగా పార్టీ బలహీనంగా ఉందన్న విషయం అధినేత అంగీకరించడం చర్చనీయాంశమైంది. మరోవైపు అయ్యన్న, గంటా మధ్య ఉన్న విబేధాలు వేదికపై కనిపించాయి. అయ్యన్నని దగ్గరకు తీసుకున్న చంద్రబాబు.. గంటాని దూరం పెట్టడంపై ఆయన వర్గీయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్‌లో బుధవారం జరిగిన ఉత్తరాంధ్ర జోనల్ సమావేశానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హాజరయ్యారు. ఊకదంపుడు ఉపన్యాసాలు, టెక్నాలజీ డైలాగులు మళ్లీ చెప్పడంతో కార్యకర్తలు డీలాపడిపోయారు. అధికారంలోకి వచ్చాక జగన్ ఒక్క ఇల్లు కట్టలేదు.. అవునా.. కాదా అని చంద్రబాబు అడిగితే ఒక్కరు కూడా అవునని చెప్పలేదు. అదేవిధంగా వైజాగ్‌ని దోచుకున్నారు.. అవునా.. కాదా అని అడిగినా.. కార్యకర్తల నుంచి సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేసిన చంద్రబాబు.. మీకు కూడా జగన్ అంటే భయం.. అందుకే అవునని చెప్పడం లేదని కవర్ చేసుకున్నారు. ఇక పార్టీని బలోపేతం కావాలంటే బయటవాళ్లు రావాలన్న బాబు వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. అంటే ఇప్పుడు పార్టీ ఉత్తరాంధ్రలో బలహీనంగా ఉందనా అనే అనుమానాలు కార్యకర్తల్లోనూ, ఇటు నాయకుల్లోనూ కలిగింది. తమ నాయకత్వంపై అధినేతకు నమ్మకం లేదన్న మీమాంసలో పడిపోయారు. మరోవైపు సాధికార సారధులు, ఓటర్ల మ్యాపింగ్‌లో పూర్ పెర్ఫార్మెన్స్ కనబరిచిన నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మండల అధ్యక్షులు, నాయకులు సిగ్గు తెచ్చుకోవాలంటూ అందరి ముందరే విమర్శించడంపైనా మండిపడుతున్నారు.

అయ్యన్నను పిలిచారు.. గంటాని దూరం పెట్టారు..
పార్టీలో వర్గవిబేధాలపైనా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో నేతలు అందరినీ కలిపేసుకుని పోవాలనీ.. కొందరు విబేధాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు అన్నారు. పార్టీలో గ్రూపులు పెట్టిన వారికి, విబేధాలు సృష్టించిన వారికి కాకుండా... త్యాగాలు చేసినవారికి మాత్రమే పదవులు వస్తాయని స్పష్టం చేశారు. గంటా, అయ్యన్న, వంగలపూడి అనితని ఉద్దేశించి చంద్రబాబు వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమైంది. అంతకు ముందు చంద్రబాబు రాకముందు కూడా వీరి మధ్య విబేధాలు బయటపడ్డాయి. సభకు ఆలస్యంగా వచ్చిన అయ్యన్న, అనితను వేదికపై ముందు వరుసలో కూర్చోవాలని నాయకులు చెప్పినా.. గంటా ముందు వరుసలో ఉన్నారని చివర్లో కూర్చున్నారు. చంద్రబాబు వచ్చినప్పుడు గంటా విమానాశ్రయానికి వెళ్లారనీ.. అయితే.. ఎయిర్‌పోర్టుకు ఎవరూ రావొద్దని చంద్రబాబు చెప్పడంతో గంటా తిరిగి వెనక్కు వచ్చేశారని సమాచారం. అదేవిధంగా బాబు వచ్చిన తర్వాత.. దూరంగా ఉన్న అయ్యన్నని దగ్గరకు పిలిచారు. కానీ.. పక్కన ఉన్న గంటాని మాత్రం చంద్రబాబు పట్టించుకోలేదు. అదేవిధంగా సమావేశం ప్రారంభమైనప్పుడు.. బాబుతో పాటు అచ్చెన్న, ఇతర ముఖ్యులతో పాటుగా అయ్యన్నని కూర్చోవాలని చంద్రబాబు చెప్పారే తప్ప.. గంటాకు ప్రాధాన్యమివ్వకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ పండగ వాతావరణంలో సాగుతోంది. సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు మహిళలు క్షీరాభిషేకం చేస్తూ.. తమ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాల్లోని మహిళల పేరుతో ఉన్న బ్యాంకు అప్పును ప్రభుత్వమే భరిస్తూ, ఆ మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం మూడో విడతకు సంబంధించి ఆయా సంఘాల ఖాతాలకు ప్రభుత్వం డబ్బులు జమ చేస్తోంది.



90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్



35వ వార్డు టర్నర్ చౌల్ట్రీ వద్ద సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి



బీచ్‌రోడ్డులోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

మహారాణిపేట: బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొని శివరామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పంచర్ల పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన ఆశయ సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, డిప్యూటీ మేయర్ కె.సతీష్, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, బిపిన్ కుమార్, మసిపోగు మేరీ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.ఎ.రెహ్మాన్, చింతలపూడి వెంకటరామయ్య, నియోజకవర్గ పరిశీలకులు కోలా గురువులు, చొక్కాకుల వెంకటరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు జాన్ వెస్లీ, సుజాత, సత్యనారాయణ, వద్దాది మధుసూదనరావు, కె.వి.బాబా, బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, పార్టీ నాయకులు రవిరెడ్డి, అల్లంపల్లి రాజబాబు, మంత్రి రాజశేఖర్, ఐ.హెచ్.ఫరూఖీ, ద్రోణంరాజు శ్రీవత్సవ్, పేర్ల విజయచంద్ర, నడింపల్లి కృష్ణంరాజు, జోనల్ ఇన్‌చార్జిలు సునీల్, మారుతీ ప్రసాద్, జిల్లా అనుబంధ అధ్యక్షులు అడ్డాల కృపాజ్యోతి, మన్యాల శ్రీనివాస్, అప్పన్న, నమ్మి లక్ష్మణ, బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గొంతుక జగ్జీవన్ రామ్
ఆరిలోవ: అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి చేశారని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం బీచ్‌రోడ్డులో పాం బీచ్ ఎదురుగా, విశాఖ మ్యూజియం ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు కలెక్టర్ మల్లికార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జేసీ విశ్వనాథన్‌తో కలిసి ఆమె పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ అంటరానివారికి సమానత్వం పోరాటం చేశారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ బలహీన వర్గాల ప్రజలకు ఆరాధ్యుడన్నారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వి.మధుసూదనరావు, డీఆర్వో డి.శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రమణమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, బీసీ సంక్షేమ శాఖ ఈడీ శ్రీదేవి పాల్గొన్నారు.

సామాన్య భక్తులకే పెద్దపీట

- చందనోత్సవానికి విశేష ఏర్పాట్లు
- ప్రోటోకాల్ భక్తులకైనా టికెట్ తప్పనిసరి
- వీఐపీ, ప్రోటోకాల్ వీఐపీలకు ప్రత్యేక దర్శన స్లాట్లు
- రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి



చందనోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఈ నెల 23న జరిగే చందనోత్సవానికి సంబంధించి అన్ని శాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ఆయన దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చందనోత్సవం నిర్వహణకు సంబంధించి రూపొందించిన ప్రణాళికను పరిశీలించారు. ఏయే ప్రదేశాల్లో ఏయే ఏర్పాట్లు చేస్తారో.. ఆ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చందనోత్సవానికి వచ్చే భక్తులంతా స్వామి నిజరూపదర్శనం చేసుకుని.. సంతృప్తిగా తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఉచిత దర్శనం భక్తులకు ప్రత్యేక క్యూలు, వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. వీఐపీలకు పరిమితమైన టైమ్ స్లాట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఆ సమయంలోనే రావాలని ముందుగానే వారందరికీ తెలియజేస్తామన్నారు. రూ.1500 టికెట్ తీసుకునే వారికి నీలాద్రిగుమ్మం వద్ద నుంచి దర్శనం అందజేస్తామన్నారు. అన్ని క్యూల్లోని భక్తులకు స్వామి కనిపించేలా వివిధ స్థాయిల్లో ర్యాంపులు వేస్తామన్నారు. ప్రోటోకాల్ భక్తులెవరైనా టికెట్ తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఘాట్‌రోడ్డను విస్తరిస్తామని వెల్లడించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దేవస్థానానికి ప్రసాద్ స్కీమ్‌లో నిధులు కేటాయించిందని.. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు మంత్రికి చందనోత్సవ ఏర్పాట్లు వివరించారు. ముందుగా మంత్రికి ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపికను ఈవో అందజేశారు.

కలెక్టర్, సీపీ క్షేత్రస్థాయి పరిశీలన
చందనోత్సవం ఏర్పాట్లపై కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ బుధవారం వివిధ శాఖల అధికారులతో సింహగిరిపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దేవస్థానం అధికారులు రూపొందించిన ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు జరిగే ప్రదేశాల్లో పర్యటించారు. తొలుత క్యూలు, భక్తులు వాహనాల పార్కింగ్, సదుపాయాల కోసం చేస్తున్న ఏర్పాట్ల మాస్టర్ ప్రణాళికను పరిశీలించారు. ఉచిత దర్శనంతో పాటు రూ.300, రూ.1000, రూ.1500 టికెట్ల క్యూలు ఎక్కడి నుంచి ప్రారంభమవుతాయో దేవస్థానం అధికారులు వారికి వివరించారు. గతేడాది ఏర్పాటు చేసిన క్యూలకు, ఈ ఏడాది ఏర్పాటు చేస్తున్న క్యూల మధ్య వ్యత్యాసాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణంతోపాటు వివిధ మార్గాల్లో వారు పర్యటించి రూట్లపై అధ్యయనం చేశారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీలు, ప్రోటోకాల్ వీఐపీలు కూడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, డీసీపీలు సునీల్ సుమిత్, ఆనంద్‌రెడ్డి, గోపాలపట్నం సీఐ నరసింహారావు, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్ యాజమాన్యానికి నోటీసులు



స్కూల్ యాజమాన్యం నుంచి వివరాలు సేకరిస్తున్న డీఈవో చంద్రకళ

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలోని నారాయణ పబ్లిక్ స్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ బుధవారం తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో చదువుతున్న నాలుగో తరగతి బాలికపై వాచ్‌మెన్ అత్యాచారయత్నం చేసిన నేపథ్యంలో ఆమె విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించి స్కూల్ యాజమాన్యం నుంచి వివరాలు సేకరించారు. పాఠశాల గుర్తింపు సర్టిఫికెట్‌తో పాటు ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. వాటిని తన వెంట తీసుకువెళ్లారు. ఘటన జరిగిన విషయాన్ని స్కూల్ యాజమాన్యం గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నోటీసులు జారీ చేశారు. దీనిపై ఎంఈవోకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. గర్ల్‌చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఖలీషబేగం, పెందుర్తి ఎంఈవో పైడపు నాయుడు పాల్గొన్నారు.

9న తెలుగమ్మాయి - 2023 మెగా ఆడిషన్స్

డాబాగార్డెన్స్: ఈవెంట్ డైరెక్టర్ వీరుమామ సారథ్యంలో లలిత జ్యూయలరీ తెలుగమ్మాయి – 2023 మెగా ఆడిషన్స్ నిర్వహించనున్నట్టు ఈవెంట్ ప్రతినిధి పద్మజ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి నగరంలోని సెవెన్ హిల్స్ ఆస్పత్రికి ఎదురుగా గల హోటల్ ఎలింగ ట్‌లో ఈ పోటీలు ఉంటాయని, 18 నుంచి 38 ఏళ్ల మధ్య వయసు గల యువతులు, మహిళలు ఉచితంగా ఆడిషన్స్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తిగా తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించే పోటీలో పాల్గొనేవారు 7013719771, 7207340513లో సంప్రదించాలని సూచించారు.

బహిరంగ ప్రకటన

K.V. RAJA SEKHAR, Advocate
D.No. 29-2-34, Vinod Law House behind lane, Opp. District Court, Visakhapatnam -530002. Mobile No: 98486 17890

కాలుష్య నియంత్రణకు డ్రోన్ టెక్నాలజీ

- పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్న ఎన్‌టీపీసీ
- ఇప్పటికే యాష్ డైక్‌ల వద్ద రెయిన్‌గన్స్‌తో ఉద్గారాల నియంత్రణ
- 30 శాతం వరకూ పీఎం10 విలువలు తగ్గుముఖం
- భూగర్భ జలాలు, సముద్ర జీవుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



యాష్‌తో తయారు చేసిన ఇటుకలు



బూడిద నియంత్రణకు చర్యలు చేపడుతున్న ఎన్‌టీపీసీ

సాక్షి, విశాఖపట్నం: కాలుష్యంపై కొన్నేళ్ల క్రితం విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో సింహాద్రి ఎన్‌టీపీసీ వినూత్న చర్యలకు ఉపక్రమించింది. విద్యుత్ ఉత్పత్తిలో భాగంగా వెలువడే బూడిద నియంత్రణకు డ్రోన్ టెక్నాలజీ ద్వారా స్ప్రేలను వినియోగిస్తోంది. యాష్ డైక్‌ల వద్ద కర్బన ఉద్గారాలు తగ్గించడంపైనా ప్రత్యేక దృష్టి సారించింది. ఉమ్మడి విశాఖ జిల్లాని సింహాద్రి ఎన్టీపీసీ 2 వేల మెగావాట్ల థర్మల్, 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో నడుస్తోంది. ఇందుకోసం నిత్యం వేల టన్నుల బొగ్గును మండిస్తోంది. దీనివల్ల బూడిద వ్యర్థాలు ఎక్కువగా ఆ ప్రాంతాన్ని కమ్ముకుని అక్కడి ప్రజల జీవన ప్రమాణాల్ని దెబ్బతీస్తున్నాయి. అప్పటి నుంచి ఎన్‌టీపీసీ కాలుష్య నియంత్రణకు నడుం బిగించింది. పీపుల్.. ప్లానెట్.. పవర్ (3పీ) నినాదంతో పర్యావరణ పరిరక్షణ చర్యల కోసం ఆధునికతను వినియోగించుకుంటోంది. గ్రీన్‌హౌస్ ఉద్గారాల నియంత్రణపై దృష్టి సారిస్తూ రాష్ట్ర, కేంద్ర కాలుష్య నియంత్రణ మండళ్ల మార్గదర్శకాల్ని అనుసరిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో సరికొత్త విధానాల్ని అవలంబిస్తోంది.

నైట్రోజన్ ఉత్పత్తి తగ్గించేలా...

థర్మల్ విద్యుత్ కేంద్రాల ఉద్గార ప్రమాణాల్ని కేంద్ర పర్యావరణ అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సవరించిన గణాంకాల ప్రకారం.. 300 ఎంజీ/ఎన్ఎం3 ఆక్సైడ్ ఆఫ్ నైట్రోజన్ (ఎన్ఓఎక్స్) ఉద్గారాలు మాత్రమే వెలువడాలి. ఈ నైట్రోజన్ ఉద్గారాల నియంత్రణకు బాయిలర్స్ వద్ద ఎన్‌వోఎస్ బర్నర్లను వినియోగిస్తోంది. స్టేజ్-2 యూనిట్స్ అన్నింటిలోనూ వీటిని అమర్చారు. వాయు ఉద్గారాల్ని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు ఫ్లూగ్యాస్ డీ సల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ)ని అమర్చే ప్రక్రియని ప్రారంభించింది. జూన్-2023 నాటికి యూనిట్-4లో పూర్తి చేయడంతో పాటు ఈ ఏడాది డిసెంబర్‌కల్లా ఎన్‌టీపీసీ మొత్తం ఎఫ్‌జీడీలు అమర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

డ్రోన్‌లను వినియోగించుకుంటూ..

బొగ్గు నుంచి వచ్చే బూడిదతో ఇటుకలు తయారీ ప్రారంభించిన ఎన్‌టీపీసీ.. బూడిద తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాల్లో యాష్‌డైక్ టెక్నాలజీని అమలు చేస్తోంది. దుమ్ము కణాలు గాల్లోకి రాకుండా డైక్‌ల చుట్టూ స్ప్రింక్లర్లు, రెయిన్ గన్స్ ఏర్పాటు చేసింది. ఆవు పేడతో కల్లాపి చల్లుతూ సంప్రదాయ పద్ధతుల్లోనూ చర్యలు తీసుకుంటోంది. యాష్‌ను మరింత నియంత్రించేందుకు డ్రోన్స్ ద్వారా స్ప్రేచేసే పద్ధతుల్ని వినూత్నంగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాల ద్వారా ఎన్‌టీపీసీ పరిసర ప్రాంతాల్లో పీఎం10 విలువలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని సంస్థ జీఎం డీపీ పాత్ర తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో పీఎం10 విలువలు 30శాతం మాత్రమే చూపించినట్టు వెల్లడించారు. భవిష్యత్‌లో భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

డిసెంబర్ 31వ తేదీ ఆఖరు

మహారాణిపేట: పట్టణ భూ గరిష్ట పరిమితి చట్టం(యూఎల్‌సీ) ప్రకారం మిగులు భూముల ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. నిబంధనలకు లోబడి పూర్తి వివరాలతో ఈ ఏడాది డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సంయుక్త కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఓ ప్రకటనలో కోరారు. జీవీఎంసీ నుంచి అనుమతి పొందిన ప్లాన్, ఇంటి పన్ను, కరెంట్ బిల్లు, నీటి పన్ను, వాటర్ పన్ను రసీదులు, ఇతర నక్లలను సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. 0-150 గజాలకు ఉచితంగా డీ-పట్టా కేటాయిస్తామన్నారు. 151- 300 గజాల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ బేసిక్ వేల్యూ(మూల విలువ)కు 15 శాతం, 300-500 గజాల వరకు 30 శాతం, 500 గజాల పైబడిన వారు ప్రస్తుత రిజిస్ట్రేషన్ బేసిక్ వేల్యూకు 100 శాతం చెల్లించాలని పేర్కొన్నారు. ఈ మొత్తంలో మొదటి విడతగా 50 శాతంను జిల్లా జాయింట్ కలెక్టర్, యూఎల్‌సీ, విశాఖపట్నం పేరిట డీడీ లేదా చెక్‌ను దరఖాస్తుతో జతచేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

అల్లిపురం: బీచ్‌రోడ్డు, గోకుల్ పార్కు వద్ద గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను మహారాణిపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామ్‌నగర్‌కు చెందిన సరగడ తరుణ్‌సాయి, నాగులాపల్లి జానకిరామ్, సురపల్లి ధనుష్‌కుమార్, ముప్పిడిపల్లి సునీల్, దుర్గాసి కనకరాజు గోకుల్ పార్కు వద్ద గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీల 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

గంగవరం పోర్టు ఉద్యోగులకు జీతాల పెంపుదల

- ఈ నెల 30 లేదా మే 31న ప్రకటన
- కొలిక్కి వచ్చిన చర్చలు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న జీపీఎస్ ఉద్యోగులకు పెంచిన జీతాలను ఈ నెల 30 లేదా మే 31న ప్రకటిస్తామని పోర్టు యాజమాన్యం ప్రతినిధులు ప్రకటించారు. జీతాలు పెంచాలని కోరుతూ ఉద్యోగులు ఇటీవల పోర్టులో పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతలపూడి వెంకటరామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, కార్పొరేటర్లు దల్లి గోవింద్, గంగారామ్‌లతో యాజమాన్య ప్రతినిధులు ఎస్. సాంబశివరావు, రాజులు పోర్టులో బుధవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరగా స్పందించిన యాజమాన్య ప్రతినిధులు స్పందించారు. ఉద్యోగులకు ఆమోదయోగ్యంగా జీతాలు పెంచుతామని చెప్పారు. తొలగించిన ముగ్గురు ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు హామీ ఇచ్చారు. చర్చల్లో వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, కార్మిక సంఘాల నాయకులు అప్పలరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి మే 20న పరీక్ష

భీమునిపట్నం: విశాఖ, అనకాపల్లి జిల్లాలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి వచ్చే నెల 20న పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ కె.రాంబాబు తెలిపారు. నర్సీపట్నం బాలురు, అచ్యుతాపురం బాలికలు, భీమిలి బాలికల గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8 తరగతుల్లో ఖాళీల భర్తీ కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులను https://aprs.apcfss.in/ ద్వారా ఈ నెల 24వ తేదీలోపు సమర్పించాలని సూచించారు.

పకడ్బందీగా 'జగనన్నే మా భవిష్యత్'



జగనన్నే మా భవిష్యత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి

జిల్లాలో 7 నుంచి 20 వరకు నిర్వహణ

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంతృప్తి చెందిన ప్రజలు 'మా నమ్మకం నువ్వే జగన్' అంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి 'జగనన్నే మా భవిష్యత్' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ ప్రజలతో మమేకమయ్యే భారీ కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. పార్టీ తరఫున సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు అన్ని నియోజకవర్గాల్లో పకడ్బందీగా ఈ కార్యక్రమం చేపడతామన్నారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, బిపిన్ కుమార్, మసిపోగు మేరీ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.ఎ.రెహ్మాన్, చింతలపూడి వెంకటరామయ్య, నియోజకవర్గ పరిశీలకులు కోలా గురువులు, చొక్కాకుల వెంకటరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు జాన్ వెస్లీ, సుజాత, సత్యనారాయణ, వడ్డాది మధుసూదనరావు, కె.వి. బాబా, బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, పార్టీ నాయకులు రవిరెడ్డి, అల్లంపల్లి రాజబాబు, మంత్రి రాజశేఖర్, ఐ.హెచ్.ఫరూఖీ, ద్రోణంరాజు శ్రీవత్సవ్, పేర్ల విజయచంద్ర, ఎన్. కృష్ణంరాజు, జోనల్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మి ఆలయంలో ఆయుష్య హోమం



ఆయుష్య హోమంలో పాల్గొన్న ఉభయదాతలు

డాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయుష్య హోమం జరిపారు. ఉదయం 8 గంటల నుంచి నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున ఉదయం 8 గంటలకు నిర్వహించే ఈ హోమంలో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుం కింద రూ.2,516 చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామా 8985515989కు పంపించాలి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టులో జాతీయ మారిటైం దినోత్సవం



మారిటైం దినోత్సవంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే, సీవీవో స్వామి

దొండపర్తి : విశాఖ పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో 60వ జాతీయ మారిటైం దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. 'అమృత్ కాల్ షిప్పింగ్' అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే మారిటైం దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. గడిచిన దశాబ్దంలో భారత నౌకాయానం ప్రగతిని విశదీకరించారు. ఈ సందర్భంగా మెరైన్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు ఆయన ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పోర్ట్ చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్. ఎల్.స్వామి, పోర్టు విభాగాధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'వాపుని చూసి బలుపు అనుకుంటున్న చంద్రబాబు'

సింహాచలం : వాపుని చూసి చంద్రబాబు బలుపు అనుకుంటున్నారని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆయన బుధవారం దర్శించుకున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఒక సంక్షేమ రాజ్యాన్ని ప్రజలందరికీ అందించేలా పాలన సాగిస్తున్నారన్నారు. అప్పట్లో లోక కల్యాణం కోసం రుషులు, మునులు చేసిన కార్యక్రమాలు ఎలాగైతే విజయవంతం అయ్యాయో... అలాగే జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయన్నారు. అనేక ఆటంకాలు కల్పించాలని రాక్షస మనస్తత్వం కలిగిన ప్రతిపక్షాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా, పచ్చమీడియా ఎన్ని అభూత కల్పనలు రాసినా ప్రజలెక్కడా నమ్మడం లేదన్నారు. ఏదో మూడు ఎమ్మెల్సీ స్థానాలు నెగ్గారని చంద్రబాబు విర్రవీగుతున్నారన్నారు. అది కూడా సింబల్‌పైన నెగ్గారా అని ప్రశ్నించారు.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు

80 మందికి రూ.31,500 జరిమానా



ప్రయాణికుల టికెట్ల తనిఖీ పర్యవేక్షిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: బెంగళూరు-భువనేశ్వర్ (18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో వాల్తేర్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి బుధవారం తనిఖీలు చేశారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం రోడ్ వరకు అన్ని క్లాసుల్లో ప్రయాణించి ప్రయాణికుల టికెట్లు పరిశీలించారు. సరైన టికెట్లు లేకుండా రిజర్వేషన్ కోచ్‌ల్లో ప్రయాణిస్తున్న 80 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.31,500 అపరాధ రుసుంగా వసూలు చేశారు. ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలు, సూచనలు స్వీకరించారు. సరైన టికెట్ లేకుండా రిజర్వ్‌డ్ కోచ్‌ల్లో ప్రయాణించడం, సరైన కారణం లేకుండా చెయిన్ లాగితే కఠిన చర్యలు తప్పవన్నారు. కదులుతున్న రైలు ఎక్కడం, దిగడం చేయవద్దని సూచించారు. అనంతరం శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ వద్ద నూతనంగా నిర్మించిన ఆర్పీఎఫ్ బ్యారక్‌ను డీఆర్ఎం ప్రారంభించారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సీహెచ్ రఘువీర్, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ సీహెచ్ కామేశ్వరరావు, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(ఈస్ట్) జిబన్ జ్యోతి సాహూ, టికెట్ తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

పాడేరు రూరల్: ఏకలవ్య పాఠశాలల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని పాడేరు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏకలవ్య పాఠశాలల్లో నవోదయ పాఠశాలల తరహాలో సీబీఎస్ సిలబస్ బోధిస్తారని పేర్కొన్నారు. 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు.ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు జిల్లాలోని ఏదైన గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022-23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలని సూచించారు. విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 4 ప్రకారం ఇంటి వద్ద ఉంటూ ఐదో తరగతి చదివిన విద్యార్థులు కూడా అర్హులన్నారు. దీనిపై విద్యార్థి యొక్క తల్లితండ్రులు/సంరక్షకుల డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తెలు గు మాధ్యమంలో చదివిన విద్యార్థులు సైతం రాత పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. ఆరో తరగతి ప్రవేశాలకు 10 నుంచి 13 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఏడో తగరతి విద్యార్థులకు 11 నుంచి 14 ఏళ్ల లోపు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు 12 నుంచి 15 ఏళ్లలోపు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు 13 నుంచి 16 ఏళ్లలోపు వయసు కలిగిన విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల తల్లిదండ్రులు, సంరక్షకుల ఆదాయం రూ.లక్షకు మించకూడదన్నారు.

శిక్షణ, ఉపాధికి దరఖాస్తుల స్వీకరణ

పాడేరురూరల్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో పాడేరు జీఎంఆర్ పాల్‌టెక్నిక్ స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ, ఉపాధి కల్పనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత తెలిపారు. టెన్త్ ఆపైబడిన విద్యార్హత కలిగి 18 నుంచి 35 ఏళ్ల వయసు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి ఆధార్, బ్యాంకు అకౌంట్, విద్యార్హత ధ్రువ పత్రాలు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పాడేరు జీఎంఆర్ పాల్‌టెక్నిక్ స్కిల్ హబ్‌లో కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు 6302636174, 9493638405లో సంప్రదించవచ్చు.

భజన పోటీల విజేత పార్వతీపురం

మాడుగుల రూరల్ : కె.జె.పురంలో బాలాంజనేయ స్వామి తీర్థం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 20 భజన బృందాలు పాల్గొన్నాయి. పోటీల్లో ప్రథమ బహుమతి పార్వతీపురం భజన బృందం జట్టుకు లభించింది. ద్వితీయ బహుమ తి కొత్తపాలెం భజన బృందానికి, తృతీయ బహుమతి వరాహపురం భజన బృందానికి లభించాయి.





మహారాణిపేట: ఉవ్వెత్తున ఎగిసి పడే కెరటాల మధ్య.. రివ్వున ఎగిరే పక్షులు చేసే సందడి చూస్తే కనులపండువగా ఉంటుంది. నిత్యం పర్యాటకులతో కళకళలాడే విశాఖ సాగరతీరానికి సీగల్ పక్షుల రాకతో అలాంటి వాతావరణమే నెలకొంది. తీరంలో చేపలు ఎండ వేసే ప్రాంతాల్లో ఇవి సంచరిస్తూ.. ఎండు చేపలను ఆహారంగా తీసుకుంటున్నాయి. ఫిషింగ్ హార్బర్, జోడుగుళ్లపాలెం, చేపల తిమ్మాపురం తదితర ప్రాంతాల్లో సందడి చేస్తూ.. కనువిందు చేస్తున్నాయి.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.61,360
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,250
వెండి(కిలో):	రూ.80,700

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.95
స్కిన్	: రూ.160
స్కిన్‌లెస్	: రూ.170

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	420.00
విజయనగరం	424.00
శ్రీకాకుళం	424.00